సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 21 । డిసెంబర్ । 2024



వదలని వాన

జిల్లాను వాన వదలడం లేదు. శుక్రవారం కురిసిన వర్షానికి రైతులు ఇబ్బంది పడ్డారు.

- 8లో



అభివృద్ధికి 'చెక్'

కూటమి నేతలు కక్ష సాధింపులు వీడడం లేదు. తాజాగా సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు.

- 8లో

నేడు క్రిస్మస్ హైటీ వేడుకలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ క్రిస్మస్ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని కలెక్టర్ స్వప్నిల్ దిన కర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడిం చారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు హైటీ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి క్రిస్టియన్ పెద్దలు, జిల్లాలోని ఆయా సంఘాలకు సంబంధించి సం ఘ కాపరులు, మైనార్టీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

వెబ్‌సైట్‌లో మున్సిపల్ టీచర్ల పదోన్నతుల సీనియారిటీ జాబితా

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు.. జిల్లాలోని నిర్దే శించిన మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూళ్లలో టీచర్ల పదోన్నతుల సీనియారిటీ జాబితా డీఈఓ అధికా రిక వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉందని జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపా రు. జిల్లాలోని ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సి పాలిటీలు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరి ధిలోని పాఠశాల సహాయకుల పోస్టుల కోసం అర్హు లైన ఎస్‌జీటీలు, తత్సమానమైన కేడర్ కలిగిన ఉపాధ్యాయుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుప ర్చినట్టు చెప్పారు. జాబితాపై అభ్యంతరాలుంటే.. ఈనెల 23వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియ జేయాలని డీఈఓ కోరారు.



గత ఏడాది ఇదే సమయానికి ట్యాబ్‌లతో శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థులు(ఫైల్)

నాడు గర్వపడి.. నేడు తడబడి



నాడు-నేడుతో సుందరంగా కనిపిస్తున్న జి.సిగడాం మండలం కొత్తపెంట గ్రామం ఎంపీపీ స్కూల్

- 8 తరగతి విద్యార్థులకు ఆగిపోయిన ట్యాబ్‌ల పంపిణీ
- గత ప్రభుత్వ పథకాలకు తూట్లు పొడుస్తున్న కూటమి సర్కారు
- తీవ్రంగా నష్టపోతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- విద్యారంగంలో వినూత్న సంస్కరణలు ప్రవేశ పెట్టిన వైఎస్ జగన్

ఇంగ్లిష్‌లో మాట్లాడడం నేర్చుకున్న బిడ్డను చూసి నాడు సామాన్యుడు ఉప్పొంగిపోయాడు.
ఆ ఆనందం ఇప్పుడు దూరమవుతోంది..
రూపాయి ఖర్చు లేకుండా పిల్లల చేతికి అందిన ఖరీదైన ట్యాబులు చూసి పేదలు మురిసిపో యారు.
ఆ సంబరం ఇప్పుడు లేకుండాపోయింది..
ప్రభుత్వ బడుల్లో శిథిల గదులకు నాడు–నేడు కొత్త ఊపిరి పోసింది..
ఆ చొరవ ఇప్పుడు కనిపించడం లేదు.
పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా అమ్మ ఖాతాలో ఠంచనుగా డబ్బు పడేది..
మాటలు కోటలు దాటుతున్నా ఖాతాలో రూపాయి జమ కావడం లేదు..
ప్రభుత్వ విద్యావ్యవస్థ గతమెన్నడూ చూడని విధం గా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అపురూప సంస్క రణలు ప్రవేశపెట్టారు. కానీ ఆ పథకాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఉత్త మాటలు చెబుతూ సామాన్యుల బిడ్డల చదువులను వెక్కిరి స్తోంది.

ఆ సంస్కరణలు మర్చిపోగలమా..?

- పేద పిల్లలను బడికి చేరువచేసేలా తల్లికి ఆర్థికంగా బాసటగా ఉండాలని అమ్మఒడి ద్వారా రూ.15వేలు అందజేశారు. అం తకు ముందు ఏ ముఖ్యమంత్రి ఈ ఆలో చన చేయలేదు.
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు 9 వస్తువులతో కూడిన విద్యా కానుక నాలుగేళ్లపాటు వరుసగా అందజేశారు.
- ఉన్నత, వృత్తి విద్యాకోర్సులు చదువు కోసం జగనన్న విద్యాదీవెన, హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల అవ సరార్థం జగనన్న వసతిదీవెను, విదేశాల్లో చదువుకుని ఉన్నతస్థాయిలో నిలదొక్కుకునేలా చేసేందుకు జగనన్న విదేశీ దీవెనను అందజేశారు.
- సర్కారీ బడుల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టి, సీబీఎస్ఈ సిలబస్‌ను అమల్లోకి తీసుకొచ్చారు.
- 3వ తరగతి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చి పాఠ్యాంశాల బోధనతోపాటు టీచర్లకు క్రమం తప్పకుండా తర్ఫీదును అందించి ఎంతో ముం దుచూపుతో వ్యవహరించారు.



- 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏటా ట్యాబ్‌లను అందజేసి వారిని అంత ర్జాతీయస్థాయిలో పోటీ ప్రపంచాన్ని తట్టు కునేలా తీర్చిదిద్దాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు.
- డిజిటల్ విద్యను సర్కారీ బడులకు చేరువ చేశారు. ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను పాఠశాలలు, కళా శాలలకు అందజేశారు. ఇలా చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్.
- జగనన్న గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని శుచికరంగా, రుచిక రంగా మార్చేశారు. రాగిమాల్ట్‌ను అం దించి విద్యార్థుల్లో ఐరన్, పోషకాలు పెరిగేలా చేశారు.
- మనబడి నాడు–నేడు పేరిట ప్రభుత్వ బడులు, కాలేజీలు, వసతి కేంద్రాలకు కొత్త శోభ తీసుకొచ్చారు.

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ విద్య తిరోగమనంలో వెళ్తోంది. ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఒక విప్లవంలా జరిగిన సంస్కరణలకు ప్రస్తుత ప్రభుత్వం చరమ గీతం పాడుతోంది. డిసెంబర్ 21 వస్తే 8వ తరగతి పిల్లల చేతికి కొత్త ట్యాబ్ అందేది. కానీ ఈ ఏడాది ఎంతగా ఎదురుచూసినా ట్యాబ్‌లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి మనసు రాలేదు. దీంతో విద్యార్థులంతా గత ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

వరుసగా రెండేళ్లు ట్యాబ్‌ల అందజేత

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యను మరింత చేరువ చేసేందుకు 8వ తరగతి చదివే బాలబాలికలకు ట్యాబ్‌ల పంపిణీకి నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. 2022 డిసెంబర్ 21న, 2023 డిసెంబర్ 21వ తేదీన రెండేళ్లపాటు ట్యాబ్‌లను అం దించారు. 8వ తరగతి పాఠాలు బోధించే ఉపాధ్యా యులకు కలిపి 25953 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. రెండో ఏడాది 25289 మంది విద్యార్థులకు శాంసం గ్ కంపెనీ తయారుచేసిన నాణ్యమైన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వీటిని బైజూస్ కంటెంట్‌తో అంద జేశారు. అలాగే 4, 5, 6, 7, 9, 10వ తరగతి విద్యా ర్థులకు బైజూస్ కంటెంట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకోసం కోట్లాది రూపాయలను వెచ్చించింది. సాంకేతికంగా వినూత్న ఫీచర్లు కలిగిన ట్యాబ్‌లో సిమ్‌కార్డు, ప్రీ లోడెడ్ ఎడ్యుకేషనల్ యాప్స్‌ను అందించింది.

జగన్ సంస్కరణలు కానరాకుండా కుయుక్తులు..

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలను విమర్శకు లు సైతం ప్రశంసించారు. కానీ ఆ సంస్కరణలు అటు ప్రజలు, ఇటు విద్యార్థులు మర్చిపోయేలా చేయాలనే రీతిలో కూటమి ప్రభుత్వం విద్యావ్యవ స్థను నిర్వీర్యం చేస్తోంది. నాడు–నేడుతో పాటు పాత పథకాలేవీ అమలు చేయడం లేదు. ప్రభుత్వ వైఖరిని విద్యావేత్తలు, ప్రజాసంఘాల నాయకులు గుర్తించి విస్తుపోతున్నారు.

చదువులను ప్రోత్సహించాలి



ఫీజు రీయింబర్స్‌మెంటు, అమ్మ ఒడి, వసతి దీవెనతో పాటు పలు పథకాలు పేదలకు ఎంతో దోహదపడ్డాయి. వీటిని ఏ ప్రభు త్వం వచ్చినా కొనసాగించాలి ఉంది. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కొనసాగించాలి. – ఎంఆర్ జ్యోతీ ఫ్రెడరిక్, విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

సీఎంఆర్ నూతన షోరూమ్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

- శ్రీకాకుళంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం
- ప్రత్యేక ఆకర్షణగా సినీతార శ్రీలీల
- జోరువానలోనూ ఆమెను చూసేందుకు అభిమానుల ఉత్సాహం



మాట్లాడుతున్న సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద సీఎంఆర్ నూతన షోరూమ్ 40వ బ్రాంచ్‌ను శుక్రవారం రాష్ట్ర వ్యవ సాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగు ణంగా ఇంత పెద్ద బంగారు, వస్త్ర దుకాణం శ్రీకా కుళం నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయ మని అన్నారు. కార్యక్రమంలో సినీ తార శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత 4 దశాబ్దాలుగా ఏపీ, తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపా రు. శ్రీకాకుళం నగరంలో ఇంత పెద్ద షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం ఆర్‌లో షాపింగ్ అంటే ప్రపంచ స్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందన్నారు. కుటుంబమంతటికీ న చ్చేలా అన్ని రకాల వస్త్రాలు తక్కువ ధరకు అందిం చడం సీఎంఆర్ ప్రత్యేకత అని తెలిపారు. సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్లో మరె వ్వరూ ఇవ్వని ధరలకు సీఎంఆర్ అందిస్తుంద న్నారు. అనంతరం సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటేనే ది వన్ స్టాప్ షాప్ అన్నారు. ఫ్యామిలీ అం దరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్ లభిస్తాయన్నారు. ప్రస్తుత యువతరానికి నచ్చేవి ధంగా అన్ని రకాల వెరైటీలు లభిస్తాయన్నారు.

జనమంతా ఆమె 'లీల'లోనే..

సినీతార శ్రీలీలను చూసేందుకు వందలాది మంది యువత షోరూమ్ వద్దకు వచ్చారు. జోరువానను కూడా లెక్క చేయకుండా ఆమెను చూసేందుకు ఎగ బడ్డారు. షోరూమ్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్ర జ్వలన చేసిన శ్రీలీల అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకా ల వస్త్రాలను పరిశీలించారు. ఇక్కడ అన్ని రకాల వస్త్రాలు నాణ్యమైనవి ఉంటాయని, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు తగిన ధరల్లో చీరలు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు లభిస్తాయ న్నారు. ఈ సందర్భంగా అభిమానులతో సెల్ఫీలు దిగి, స్టెప్పులు వేసి ఉర్రూతలూగించారు. కార్యక్ర మంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ప్రము ఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ కె.సోమేశ్వరరావు, టెక్స్‌టైల్ మొదటి కొనుగోలుదారు లుగా అంధవ రపు ప్రసాద్, ప్రముఖ వ్యాపారవేత్త పత్తి ఆనందరావు తదితరులు పాల్గొ న్నారు.



షాపింగ్‌మాల్‌లో శారీలను చూపిస్తున్న శ్రీలీల



అభిమానులతో శ్రీలీల సెల్ఫీ

క్లుప్తంగా

పీజీ సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వర్సిటీలో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు విద్యార్థులతో ల్యాబుల్లో పరీక్షలు రాస్తున్నట్లు సైతం ప్రచారం జరుగుతోంది. ఇన్విజిలేషన్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అప్పగించగా, వారు నాన్ టీచింగ్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించి వారి వ్యక్తిగత పనులు చూసుకుంటున్నట్లు సమాచారం. దీంతో మాస్ కాపీయింగ్ జరుగుతోంది. పలువురు విద్యార్థులు సైతం ఈ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ వద్ద ఈ విషయం ప్రస్తావించగా, చూసి రాతలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇన్విజిలేటర్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోధన సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి హామీ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. బీటీ, సీసీ రోడ్లు, తదితర పనులు వర్షాలు తగ్గిన వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం సమీక్షిస్తానన్నారు. సమస్యలు ఉంటే చెప్పాలన్నారు.

31 వరకు ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: 2025–26 విద్యా సంవత్సరానికిగాను కొత్తగా ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఏర్పాటుకు, పాఠశాలల అప్‌గ్రేడేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసే ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య లేదా అప్పటికే నడుస్తున్న పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను బట్టి లేదా అవసరాన్ని బట్టి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని డీఈఓ పేర్కొన్నారు. ఏపీ పాఠశాల విద్య డైరెక్టర్ అమరావతి వారి దేశాల మేరకు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో నిర్దేశించిన నిబంధనల ప్రకారం వివరాలు సమర్పించాలన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల్లో సృజనను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలసి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజును అధికారులు సత్కరించారు.

తడిసిన ధాన్యం కొంటాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా అంతటా వానలు పడుతున్నందున వరి నష్టపోకుండా జాగ్రత్తలు చేపట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. వర్షాల వల్ల ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తడిసి ముద్దయిన, రంగు మారిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట నియోజక వర్గాల పరిధిలో పొలాల్లో ధాన్యం ఉందని, వాటిని సంరక్షించుకోవాలన్నారు. శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

వేధింపులతో అభివృద్ధికి చెక్

- సరియాపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు
- మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అశోక్ సిఫారసులతో చర్యలు

కంచిలి:

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోంది. అన్ని రంగాల్లో తన ఊరిని అభివృద్ధి చేసిన మఠం సరియాపల్లి పంచాయతీ సర్పంచ్ కొణపల సురేష్‌పై స్థానిక టీడీపీ నేతలు కక్ష కట్టారు. పంచాయతీలో ఎప్పుడూ జరగని స్థాయిలో అభివృద్ధి జరిగినప్పటికీ ఆయనపై ఫిర్యాదులు చేశారు.

ఆ ఫిర్యాదులకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడుల సిఫారసులతో జిల్లా పంచాయతీ అధికారులు ఆగమేఘాలపై చర్యలకు ఉపక్రమించారు. సర్పంచ్ సమాధానం ఇచ్చినా సంతృప్తి చెందకుండా చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేశారు.


గ్రామ పంచాయతీ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం


నారాయణబట్టి గ్రామం వద్ద మండల పరిషత్ నిధులతో ప్రయాణికులు విశ్రాంతి మండపం నిర్మాణం

పంచాయతీలో జరిగిన కొన్ని అభివృద్ధి పనులు..

- పంచాయతీ పరిధి నారాయణబట్టి గ్రామం వద్ద మండల పరిషత్ నిధులతో ప్రయాణికులు విశ్రాంతి మండపం నిర్మించారు.
- మఠం సరియాపల్లి ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారాన్ని ఉపాధిహామీ నిధులతోపాటు తన సొంత నిధులతో నిర్మించారు.
- నెయ్యిల వీధిలో పంచాయతీ నిధులతో సామాజిక మండపం నిర్మాణం చేశారు.
- కొత్తవీధిలో మండల పరిషత్, పంచాయతీ నిధులతో సామాజిక మండపం నిర్మాణం చేశారు.
- దాలేశ్వరం గ్రామంలో ఎంపీపీ నిధులతో సామాజిక మండపం నిర్మించారు.
- రాగుపురం గ్రామంలో ఎంపిపి, పంచాయతీ నిధులతో సామాజిక మండపం కట్టారు.
- దాలేశ్వరం గ్రామంలో ఎంపీపీ, ఉపాధిహామీ నిధులతో శ్మశాన మండపం ఏర్పాటు చేశారు.


మఠం సరియాపల్లిలో గడప గడపకూ.., పంచాయతీ నిధులతో వైఎస్సార్ పార్కు ఏర్పాటు

అభివృద్ధి చూసి ఓర్వలేకనే..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఏ గ్రామ పంచాయతీలో చేపట్టని విధంగా ఇక్కడ పనులు చేశాం. వాటిని చూసి ఓర్వలేకనే అసూయపడి చెక్ పవర్‌ను రద్దు చేయించారు. ప్రగతిని పరిగణనలోకి తీసుకోకుండా తప్పుడు ఫిర్యాదులు చేసిన వారికి వత్తాసు పలుకుతూ జిల్లా పంచాయతీ అధికారి చర్యలకు ఉపక్రమించడం దారుణం. ఇది కేవలం కక్ష సాధింపు మాత్రమే.

– కొణపల సురేష్‌కుమార్, సర్పంచ్

- మఠం సరియాపల్లి గడప గడకూ వైఎస్సార్, గ్రామ పంచాయతీ నిధులతో వై.ఎస్.ఆర్ పార్కు ఏర్పాటు చేశారు.
- గ్రామ పంచాయతీ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ కట్టారు.
- వైఎస్సార్ పార్కులో పిల్లలు ఆడుకునే వస్తువులను పంచాయతీ నిధులతో ఏర్పాటు చేశారు.

‘పవర్ ప్రేమికుడు’కి మొదటి బహుమతి

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు విద్యుత్ వినియోగదారుల కోసం తీసిన లఘు చిత్రం ‘పవర్ ప్రేమికుడు’ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. శుక్రవారం విజయవాడలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు చేతులమీదుగా తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు, విద్యార్థులు వి.వైకుంఠరావు, డోల వరప్రసాదరావు, ఎ.ఈశ్వర్, ఆర్.తేజలకు రూ.20వేలు నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఎపిఎస్ఈసిఎం) నిర్వహించిన పోటీల్లో పవర్ ప్రేమికుడు లఘు చిత్రంలో విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


బహుమతులను అందుకుంటున్న మోడల్ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు

ఢీకొట్టి పరారైన ఆటో

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులో ఉన్న శ్రీనివాస కూడలి వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ వృద్ధుడు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో అతివేగంగా వచ్చి ఆయనను బలంగా ఢీకొట్టింది. వృద్ధుడు గాయాలతో రోడ్డుపై పడిపోవడంతో ఆటో డ్రైవర్ పరారైపోయాడు. క్షతగాత్రుడిని పలాస మండలం చిన్నమాకన్నపల్లి గ్రామానికి చెందిన జుత్తు కామేష్‌గా గుర్తించారు. స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందించగా పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఢీ కొట్టి పరారైన ఆటోకు సంబంధించిన సీసీ పుటేజీలు కాశీబుగ్గ పోలీసులు సేకరిస్తున్నారు.


కాశీబుగ్గ శ్రీనివాసకూడలి వద్ద రోడ్డుపై పడి ఉన్న కామేష్

జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా భద్రాజీ

అరసవల్లి: జిల్లా దేవదాయ శాఖ ఇన్‌చార్జి అధికారిగా వై.భద్రాజీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లా అధికారిగా బాధ్యతల్లో ఉన్న ప్రసాద్‌పట్నాయక్ సెలవులోకి వెళ్లడంతో ఆ బాధ్యతలను అరసవల్లి ఈఓగా ఉన్న భద్రాజీకి అప్పగించారు. అరసవల్లి ఆలయానికి డిప్యూటీ కమిషనర్/ఈఓగా పనిచేస్తున్న భద్రాజీకి రథసప్తమి ఉత్సవాల నిర్వహణ బాధ్యతలున్న నేపథ్యంలో జిల్లా శాఖ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా అరసవల్లిలో రథసప్తమి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా బాధ్యతలను పొరుగు జిల్లాలకు చెందిన అధికారులకు అప్పగించకుండా అరసవల్లి ఈఓకు అప్పగించడంపై సంబంధిత శాఖలోనే చర్చనీయాంశమైంది.


వై.భద్రాజీ, ఈఓ

‘అనర్హుల పింఛన్లు తొలగిస్తాం’

టెక్కలి: అనర్హుల పింఛన్లు తొలగించి అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు అందజేస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. శుక్రవారం కోటబొమ్మాళిలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలకు చర్యలు తీసుకుంటున్నామని, పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడు బోయిన రమేష్ తో పాటు సభ్యులు మంత్రిని కలిశారు. ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగాలను భర్తీ చేయాలని పలువురు విన్నవించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తెలకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై స్కూటీపై వెళ్తుండగా శుక్రవారం కారు ఢీ కొట్టటంతో తల్లీకుమార్తెలు యతిరాజుల చంద్రకళ, కుమార్తె మౌనిక గాయపడ్డారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస నవోదయ పాఠశాలలో కుమార్తె 10వ తరగతి చదువుతోంది. ఆమెను స్వగ్రామం కేశవరావుపేటకు తీసుకువచ్చేందుకు తల్లి స్కూటీపై వెళ్లింది. ఇద్దరూ బండిపై వస్తుండగా నవభారత్ నుంచి కింతలి మిల్లు వైపు సర్వీస్ రోడ్డుపై నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే క్రమంలో కొయ్యరాళ్ల కూడలి సమీపంలో కారు వీరి బండిని ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తల్లీకుమార్తెలు రోడ్డుపై పడిపోయారు. ఇద్దరికీ చిన్న దెబ్బలే తగలడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు నంబర్ ప్లేట్ రోడ్డుపై పడిపోవటంతో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్‌కు వాట్సాప్‌లో స్థానిక ప్రయాణికులు ఫొటో పంపించారు. అనంతరం 108లో శ్రీకాకుళం రిమ్స్‌లో క్షతగాత్రులు చేరారు. శ్రీకాకుళం సమీపంలో ఢీ కొట్టిన వాహనాన్ని గుర్తించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన తల్లీకుమార్తెలు చంద్రకళ, మౌనిక

చివరి రోజు క్రీడలు వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన అంతర్ పాలిటెక్నిక్ ప్రాంతీయ క్రీడలు శుక్రవారం ముగియాల్సి ఉండగా, వానల కారణంగా వాయిదా పడ్డాయి. శుక్రవారం వర్షం కారణంగా ఆటలు ప్రారంభం కాలేదు. దీంతో ముగింపు కార్యక్రమం వాయిదా పడింది. వానలు తగ్గిన తరువాత విద్యార్థులకు సమాచారం ఇస్తామని, చివరి రోజులు క్రీడలు నిర్వహణ, ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకి రామయ్య శుక్రవారం తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

కాశీబుగ్గ: చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ పలాస సివిల్ కోర్టు జడ్జి యు.మాధురి గురువారం తీర్పు ఇచ్చారు. శ్రీరామ్ చిట్స్ పలాస బ్రాంచ్‌కి బకాయి నిమిత్తం పలాసకి చెందిన తంగుడు శ్రీధర్ రూ.1,47,000కు చెక్ ఇచ్చారు. ఈ చెక్ తీసుకొని చిట్స్ యాజమాన్యం బ్యాంక్‌కు వెళ్లగా బౌన్స్ అయిందని సంబంధిత అధికారులు తెలిపారు. కంపెనీని శ్రీధర్ మోసం చేశాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో పలాస జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్‌ఫస్ట్ క్లాస్ న్యాయ అధికారి విచారణ జరిపారు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడికు ఆరు నెలల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు


విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఈ కృష్ణమూర్తి, ఈఈ యోగేశ్వరరావు

అరసవల్లి: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఈమేరకు ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యుత్ పొదుపు అవగాహనపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు.

యువకుడు అనుమానాస్పద మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ చిన బడాం గ్రామంలో శుక్రవారం ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందాడు. గ్రామ సమీపంలోని చెట్టు వద్ద ఉరికి వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని చినబడాంకు చెందిన అట్టాడ మురళి(26)గా గుర్తించారు. పోలీసులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి..


అట్టాడ మురళి (ఫైల్)

మురళి, అదే గ్రామానికి చెందిన అక్షయ అనే అమ్మాయి ఏడాది కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అక్షయ తల్లిదండ్రులు వీరి వివాహానికి ఒప్పుకోకపోవడంతో వీరిద్దరూ ఇళ్ల నుంచి పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏడాది పాటు సాఫీగా సాగిన వీరి దాంపత్య జీవితంలో కొద్ది రోజులు కిందట కలహాలు ఏర్పడ్డాయి. గర్భం దాల్చిన అక్షయ భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయని మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.


చెట్టుకు వేలాడుతున్న మురళి మృతదేహం

భార్య అక్షయ, ఆమె తల్లిదండ్రులు ఇటీవల మురళితో గొడవపడ్డారని, తప్పుడు కేసులు కూడా పెట్టారని వారు పోలీసులకు వివరించారు. భార్య మురళిని వేధించేదని, ఆమె తీరుపై మురళి తీవ్రంగా మనస్తాపం చెందేవాడని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భార్య తరపు వారే చంపేసి గ్రామంలోని ఎగువ చెరువు గట్టుపై చెట్టుకు ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్ఐ చంద్రరావు వెల్లడించారు.

పవన్ అనుచిత వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోరా ?

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై చెప్పు చూపించి అనుచితంగా మాట్లాడాననే కారణంతో తనపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని, అయితే అప్పట్లో ఇదే పవన్‌కల్యాణ్ వైఎస్సార్‌సీపీ మంత్రులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోరా అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రశ్నించారు. పవన్‌పై ఎమ్మెల్సీ దువ్వాడ అనుచితంగా వ్యాఖ్యలు చేశారనే కారణంతో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుపై ఇటీవల పోలీసులు దువ్వాడకు నోటీసులు అందజేశారు. దీనికి సంబంధించి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం టెక్కలి పోలీస్ స్టేషన్‌కు విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్‌పై దుర్భాషలాడాననే కారణంతో తనకు నోటీసులు ఇచ్చారని అయితే అందులో తేదీ, సమయం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం కక్ష సాధింపు చర్యలుగా మంత్రి అచ్చెన్నాయుడు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని దువ్వాడ దుయ్యబట్టారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా తాను భయపడేది లేదన్నారు. పోలీసులతో తప్పుడు చర్యలకు ప్రోత్సహిస్తున్నారని ఇది మంచిది కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టకుండా ఇలా కక్షపూరితమైన చర్యలపై దృష్టి పెట్టడం సిగ్గుచేటుగా ఉందని దువ్వాడ మండిపడ్డారు.


టెక్కలి పోలీస్‌స్టేషన్ బయట మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

గార: జైలులో ఉండే ముద్దాయిలు, ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం అంపోలు జిల్లా జైలులో సంస్థ కార్యదర్శి జిల్లా సీనియర్ జడ్జి ఆర్.సన్యాసినాయుడుతో కలిసి లైబ్రరీ, వంటగదులు, బ్యారెక్‌లను పరిశీలించారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతూ జైలులో ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. బెయిల్‌కు సంబంధించి ప్రతి వారం న్యాయవాదులు, పారా వలంటీర్లను పంపించడం జరుగుతుందన్నారు. జైలు సూపరింటెండెంట్ వి.సన్యాసిరావు, దివాకర్ నాయుడు, పి.అంజనీకుమార్, హర్షవర్ధన్, వైద్య సిబ్బంది, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.


జిల్లా జైలును సందర్శిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక రద్దు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరపున జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడల్లో పాల్గొనే అథ్లెట్ల ఎంపిక పోటీలు రద్దు చేసినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎ.భాస్కర్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో శనివారం ఈ ఎంపికలు జరగాల్సి ఉండగా అంతర వర్సిటీ క్రీడలకు పంపించే సమయం లేకపోవటం, ఎంపికలకు అవకాశం లేక పోవటంతో రద్దు నిర్ణయం తీసుకున్నామన్నారు.

వదలని వాన


వజ్రపుకొత్తూరు: బెండిగేటు ప్రాంతంలో ఇటుకలపై కప్పి ఉంచిన టార్పాలిన్లు

- శుక్రవారం జిల్లాలో 540 మిల్లీమీటర్ల వర్షం
- మరో 24 గంటల పాటు ఇదే పరిస్థితి
- రైతుల్లో పెరుగుతున్న ఆందోళన

శ్రీకాకుళం పాత బస్టాండ్:

జిల్లాను ముసురు వదలడం లేదు. గడిచిన రెండు రోజులు కంటే శుక్రవారం వర్షాలు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 540 మిల్లీమీటర్ల వాన పడింది. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో చలి తీవ్రత కూడా పెరిగింది. మరో 24 గంటలు ఇదే వాతావరణం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ముసురు పట్టినట్టు వాన ఏకధాటిగా పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా వరి పంట కుప్పలతో పొలాల్లో ఉండిపోవటం, కురుస్తున్న వర్షాలకు కుప్పల కిందకి వర్షపు నీరు వెళ్లడంతో పంట పాడవుతుందని భయపడుతున్నారు. అలాగే వరి కుప్పలు పైనుంచి వర్షం పడడంతో కుప్పలు నానిపోతున్నాయని, వరి గింజ మొక్కలు మొలిచే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతులకు గోనె సంచులు ఇవ్వకపోవడం, సరైన గోదాము సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదురైనట్లు పేర్కొన్నారు.


నరసన్నపేట: దేవాది వద్ద పొలంలో పరిస్థితి

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)		
గార	40.2	పాతపట్నం	16.4
శ్రీకాకుళం	34.8	మెళియాపుట్టి	16.2
ఎచ్చెర్ల	31.4	జి.సిగడాం	16.8
సరుబుజ్జిలి	29.0	బూర్జ	16.4
ఆమదాలవలస	28.4	కొత్తూరు	14.2
లావేరు	28.2	పలాస	11.4
రణస్థలం	26.4	సంతబొమ్మాళి	11.0
నరసన్నపేట	26.6	టెక్కలి	10.8
హిరమండలం	23.0	నందిగాం	8.2
పోలాకి	20.8	మందస	7.8
కోటబొమ్మాళి	19.8	కవిటి	3.0
సారవకోట	19.4	కంచిలి	2.8
పొందూరు	19.8	సోంపేట	2.2
జలుమూరు	18.2	ఇచ్ఛాపురం	1.8
		వజ్రపుకొత్తూరు	1.0


ఎల్ఎన్ పేట: వాడవలస వద్ద మొక్కజొన్న పొలంలోకి చేరిన నీరు

వాన పడుతుందని తెలిసినా..

తుఫాన్‌పై వాతావరణ శాఖ ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది. కానీ ప్రభుత్వం మాత్రం రైతులను ఆదుకునేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు వేగవంతం చేసే ప్రయత్నాలేవీ కనిపించలేదు. దీంతో నూర్చిన పంట కూడా పొలాల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలుకు లక్ష్యం పెట్టుకోగా.. 2,36,000 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. నూర్పులు జరిగి పొలాల్లో ఉండిపోయిన ధాన్యం లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉంటుంది. ఈ ధాన్యం తడిచిపోతోంది. ఈ ఏడాది పీపీసీల్లోనూ, ధాన్యం సేకరణ తర్వాత గోదాము సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. టార్పాలిన్లు కూడా అధికార పార్టీ కళ్లాలకు చేరినంత సులువుగా సామాన్యులకు చేరడం లేదనే విమర్శ ఉంది.


గార: శ్రీకూర్మం సెగిడిపేట గ్రామంలో వీధిలో నిలిచిన వాన నీరు